## క్లుప్తంగా

### అండర్‌పాస్‌లో అంధకారం


అలుగులగూడెం వద్ద అండర్‌పాస్

దెందులూరు: కోట్లాది రూపాయలతో రైల్వే శాఖ నిర్మించిన అలుగులగూడెం రైల్వే క్రాసింగ్ వద్ద అండర్‌పాస్‌లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని రెండు మండలాల ప్రజలు కోరుతున్నారు. ఏడాది కిందట రైల్వే ఏర్పాటు చేశారు. కేవలం ట్రాక్ కింద మాత్రమే రెండు ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. అండర్‌పాస్ ప్రారంభం నుంచి ట్రాక్ కింద వరకు ట్రాక్ కింద నుంచి నలుగురు పైకి ఎక్కే వరకు ఒక్క ట్యూబ్ లైట్ కూడా ఏర్పాటు చేయలేకపోవడంపై రెండు మండలాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయలు అండర్‌పాస్ కోసం వెచ్చించిన రైల్వే శాఖ రూ.500లు పెట్టి ట్యూబ్ లైట్లు కూడా ఏర్పాటు చేయలేక పోతే అర్థం ఇస్తున్నారు. ప్రతిరోజు చీకటిలో వేలాది మంది ప్రజలు ఎలా రాకపోకలు కొనసాగించాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అండర్‌పాస్‌కి ఇరువైపులా ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేసి ప్రయాణంలో చీకటి లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు రైల్వే శాఖ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

### డ్రెయిన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఉంగుటూరు: ఆక్రమణలకు గురైన డ్రెన్లు పంట కాలవులు సర్వే చేయించి పూర్తి స్వరూపం వచ్చేలా కృషి చేస్తానని, సాగు నీరు అందించేలా చేస్తామని ఉంగుటూరు శాసనసభ్యుడు పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం ఉంగుటూరు క్యాంపు కార్యలయంలో ఇరిగేషన్ డ్రెయిన్లు అధికార్లు, సాగునీటి సంఘాల ప్రతినిధులతో సమావేశం జరిపారు. సమావేశంలో రైతులు ఎదొర్కొంటన్న సమస్యలు సమావేశంలో సాగునీటి సంఘాల ప్రతినిధలు మెరపెట్టుకున్నారు. పాడైపోయిన తూములు సమస్యలు సమావేశంలో చర్చించారు. సమావేశంలో పలుడివిజన్ల సెక్షన్ అధికార్లు డి ఇలు, ఎ ఇలు, డిస్ట్రిబ్యూటరీ కమిటి చైర్మెన్ రెడ్డి శివ ప్రసాద్, ఇరిగేషన్ ఎ ఇ సుధారాణి, నీటిసంఘాలు అధ్యక్షులు, మెంబర్లు, అడవికొలను, గుండుగొలను ,అర్ధవరం, తాడేపల్లిగూడెం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

### రామాలయంలో కళ్యాణ సప్తాహ మహోత్సవం


ఉంగుటూరు: మండలంలోని కై కరం కొంగ రామాలయంలో సీతారాముల కళ్యాణం సప్తాహ మహోత్సవం 5 వరోజు విశేషమైన పూజ చేశారు. లలితా సహస్ర నామ పారాయణంపై శిక్షణ ఇచ్చారు. ఆయుర్వేద డాక్టరు కిషోర్ కుమార్ స్వామివారి ని దర్శించుకుని పూజలు చేశారు. ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. రామాయణంపై స్వామిని పూర్వజానంద సరస్వతి మాతాజీ చే ప్రవచనం చేశారు. ప్రహశిక నాలుగు నిర్వహించారు. రాత్రి 9గంటలకు ఉయ్యాల సేవ చేశారు. ఎండారామదాసు, నాగమణి దంపతులు భక్తులకు ప్రసాద వితరణచేశారు.

### రామాలయంలో విశేష పూజలు


పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు

దెందులూరు: మండలంలోని ఉప్పుగూడెంలోని కోదండ రామాలయంలో గురువారం హోమాలు బ్రహ్మశ్రీ ఎస్ఎస్‌వీ శాస్త్రి సిద్ధాంతి, కోదండ రామాలయం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాగణపతి పూజ, యాగశాల ప్రదక్షిణము, మూలమంత్ర జపము జలాధివాసము మంగళహారతి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఈనెల 13న ఉదయం హనుమ సీతారామ లక్ష్మణ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని కోదండ రామాలయం కమిటీ తెలిపింది. తొలుత భక్తులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### వీఆర్‌ఓ శ్రీనివాస్ సేవలు స్ఫూర్తిదాయకం


శ్రీనివాస్ సంస్మరణ సభలో నివాళులర్పిస్తున్న వీఆర్‌ఓలు

దెందులూరు: వీఆర్‌ఓగా శ్రీనివాసరావు సేవలు స్ఫూర్తిదాయకమని దెందులూరు తహసీల్దార్ బి సుమతి, పోతునూరు గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్, వీఆర్‌ఓలు అసోసియేషన్ దెందులూరు మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. గురువారం పోతునూరు స్వరాజ్ భవన్ లో ఇటీవల మృతి చెందిన దెందులూరు వీఆర్‌ఓ సంస్మరణ సభ జరిగింది. శాఖపరమైన లక్ష్యాల సాధనకు గ్రామాల్లో ప్రజలు ప్రభుత్వానికి వారధిగా అందరూ మెచ్చుకునేలా సేవలు అందజేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణస్వామి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని పాల్గొన్నారు.

# ఆక్వా రైతుకు ఏదీ భరోసా ?

- రూ.30 నుంచి రూ.50కి పడిపోయిన రొయ్య ధరలు
- ఆదుకోని కూటమి సర్కార్
- క్రాప్ హాలిడే దిశగా ఆక్వా రైతులు


నిడమర్రులో 50 కౌంటు మీద ఉన్న రొయ్యల చెరువులు


మండలపర్రులో రొయ్యిల పట్టుబడుల్లో బిజీగా ఉన్న రైతులు

నిడమర్రు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన పది నెలల నుంచి రొయ్యల ధరలు తగ్గడమే గానీ పెరిగిన దాఖలాలే లేవు. అంతకు ముందు అంతర్జాతీయ మార్కెట్ ధరలు ఎలా ఉన్నా సరే కనీసం 15 రోజులు పాటు ఒకే ధర కొనసాగేది. కానీ గత కొంత కాలంగా ఏరోజు ఏధర ఉంటుందో కూడా చెప్పలేని పరిస్థితుల్లో..అమెరికా భారత్ ఆహార ఉత్పత్తులపై దిగుమతి సుకం పెంపుతో ఆక్వా రంగం పరిస్థితి ఇంకా దారుణంగా మారింది. అమెరికా ట్యాక్స్ సాకుతో రొయ్యలు కొనుగోలు చేసే కంపెనీలు సిండికేట్‌గా మారి కిలో రూ.30 నుంచి రూ.50 వరకు ధరలు తగ్గించినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆక్వా రంగంలోని సమస్యలకు పరిష్కారం కనుగొంటాము అంటూ సీఎం చంద్రబాబు ప్రకటనలు చేస్తూనే ఉన్నారు.. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కన్పించడం లేదు. వనామీ రైతులకు కంటితడుపు చర్యగా చంద్రబాబు సర్కారు కేవలం 100 కౌంటుకు మాత్రమే మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటించి చేతులు దులుపుకుంది. దీనివల్ల తమ కష్టాలు గట్టు ఎక్కవని, ప్రభుత్వమే తప్పనిసరి పరిస్థితిల్లో సాగు సమ్మె చేసే దిశగా తమను నెట్టివేస్తోందని రైతులు వాపోతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో సుమారు 22 వేల ఎకరాల్లో రొయ్యిల సాగు జరుగుతోంది. ప్రస్తుతం 15 నుంచి 18 వేల ఎకరాల్లో వివిధ కౌంట్‌లలో రొయ్యి పెంపకం జరుగుతున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు.

**తగ్గుతున్న రొయ్యల ధరలు**

ప్రభుత్వం 100 కౌంటుకు రూ.220 మద్దతు ధరగా ప్రకటించింది. అయినప్పటికీ తమకు రూ.20 నుంచి రూ.30 వరకూ నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు. ట్రేడర్స్ 30, 40 కౌంట్ రొయ్యలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపించడం లేదు. ట్రంప్ ప్రకటన నాటి నుంచే వీటి ధరలను అమాంతంగా తగ్గించారు. ఆ రెండు కౌంట్ల ధరలు రూ.60 నుంచి రూ.100 వరకూ తగ్గించేశారు. ప్రస్తుతం 60, 70 కౌంట్ రొయ్యలే కొనుగోలు చేసేందుకు అసక్తి చూపిస్తున్నారు. అయితే అమెరికా ప్రకటించిన సుంకం అమలు బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది. అయితే ఇప్పటికే ఎగుమతిదారులు ధర తగ్గించి కొనుగోల్లు చేస్తున్నారు. అమల్లోకి రాకముందే కొనుగోల్లు ఈ విధంగా ఉంటే అమల్లోకి వచ్చాక పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో ధరలు మరింత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ప్రచారం సాగుతుండటంతో నియోజకవర్గంలో పట్టుబడులు ముమ్మరం చేశారు.

**క్రాప్ హాలిడే దిశగా**

అమెరికా ప్రకటన తర్వాత అక్వా అమ్మకాల్లో చోటు చేసుకున్న మార్పులతో ఇప్పటికే ఆక్వా రైతులు రోడ్డెక్కి ఆందోళనలు కొనసాగిస్తున్నారు. అమెరికాలో 40, 50 కౌంట్ రొయ్యలకు మాత్రమే సుంకం విధిస్తే ఇక్కడకు వేరే దేశాలకు వెళ్లే 100 కౌంటు రొయ్యలను విపరీతంగా ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఆక్వా రైతు సంక్షేమ సంఘం నేతలు చెబుతున్నారు. ఇప్పటికే ఆక్వా రైతులంతా సమావేశాలు ఏర్పాటు చేసుకుని సమన్వయంతో ఒక నిర్ణయానికి వచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకటి, రెండు రోజుల్లో స్పందించి తమ సమస్యలు పరిష్కరించకపోతే మూకుమ్మడిగా క్రాప్ హాలిడే ప్రకటించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆక్వా రైతులు హెచ్చరిస్తున్నారు.

### క్రాప్ హాలిడే ఒక్కటే దిక్కు



అమెరికా దిగుమతి సుంకం పెంపు నిర్ణయంతో కంపెనీలు సిండికేట్‌గా మారి దోపిడీకి గురిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రస్తుత పరిస్థితిల్లో గిట్టుబాటు ధర కల్పిస్తే తప్ప రైతుకు మేలు జరగదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రాంతాల వారీగా పంట విరామం ప్రకటించడం తప్ప మాకు వేరే మార్గం లేదు.

– వేగిరెడ్డి యుగంధర్, ఆక్వా రైతు సంక్షేమ సంఘం సభ్యుడు

### జగన్ రైతులకు అండగా నిలిచారు



గతంలో కరోనా తదితర కారణాలతో ఇటువంటి విపత్కర పరిస్థితి ఎదురైనప్పుడు వైఎస్ జగన్ జోక్యం చేసుకొని రైతులకు అండగా నిలిచారు. మంత్రులతో ఆక్వా సాధికారత కమిటీని ఏర్పాటు చేసి అప్సడా ద్వారా ప్రతి 15 రోజులకోసారి సమీక్షిస్తూ అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా ధరలు క్రమబద్ధీకరించేది. కానీ కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం.

–పుప్పాల శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: భీమడోలు విద్యుత్ స్టేషన్ పరిధిలో పూళ్ల, సూరప్పగూడెం, గుండుగొలను సబ్‌స్టేషన్ ఏరియాల్లో చెట్లు నరకం, మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటు కారణంగా ఈనెల 11వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏలూరు విద్యుత్ ఆపరేషన్స్ ఈఈ కేఎం అంబేడ్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దుద్దేపూడి, పూళ్ల, కురెళ్లగూడెం, ఎంఎంపురం ఇండస్ట్రియల్ ఫీడర్లకు, నాగహనుమాన్ ఇండస్ట్రియల్‌లకు, భీమడోలు, గుండుగొలను, సూరప్పగూడెం, పోలాసనిపల్లి, పాతూరు, అన్నేవారిగూడెం, కోడూరుపాడు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బంది సహకరించాలని ఆయన కోరారు.

### పున్నమి హోటల్ వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు


పున్నమి హోటల్ వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

దెందులూరు: మండలంలోని దెందులూరు జాతీయ రహదారిపై సత్యనారాయణపురం సమీపంలో ఉన్న పున్నమి హోటల్ వద్ద రోడ్డుకు అటువైపు రెండు హెచ్చరిక బోర్డులను పోలీసులు ఏర్పాటు చేశారు. ఇటీవల పున్నమి హోటల్ వద్ద వెనుక ముందు జరిగిన రోడ్డు ప్రమాదాలు నష్టాలతో పోలీసు రవాణా శాఖలు జిల్లా ఎస్పీ, రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సంయుక్త ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిపై హోటళ్లు, దాబాలు టిఫిన్ సెంటర్ల వద్ద ఎటువంటి వాహనాలు నిలుపుదల చేసిన నిర్వహకులు ఆ వాహనాలపై తీవ్ర చర్యలు ఉంటాయన్నారు.

# కియోస్క్ సేవలకు ఇక సెలవేనా..!

- ఆర్‌బీకేల్లో నిరుపయోగంగా కియోస్క్ యంత్ర పరికరాలు
- కియోస్క్ స్థానంలో పీఎంఏఐడీ యాప్ ఏర్పాటు
- కొత్త యాప్‌తో అరకొరగా సేవలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు


ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ (ఫైల్‌ఫోటో)

దెందులూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇప్పటికే గత ప్రభుత్వంలో అమలు చేసిన పలు పథకాలను రద్దు చేస్తుండగా, మరి కొన్నింటిని పేర్లు మార్చివేస్తుంది. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా సచివాలయం, రైతు సంక్షేమమే ధ్యేయంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం సేవలను సైతం ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేసే దిశగా అడగులు వేస్తోంది. ముఖ్యంగా రైతులకు వారి ఊరిలోనే నాణ్యమైన విత్తనాలు, ఎరువులతో పాటు వారికి అవసరమైన సేవలు అందించేందుకు జగన్ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో రైతులకు తమకు కావాల్సిన వ్యవసాయ సేవలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేందుకు వీలుగా కియోస్క్ యంత్రాలను ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం కియోస్క్‌లు ఆర్‌బీకేల్లో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. రైతులకు కావాల్సిన ఎరువులు, యంత్ర పరికరాలు, పశువుల దాణా, మార్కెటింగ్ వంటి అన్ని రకాల సేవలను ఆన్‌లైన్‌లో పొందేందుకు గత ప్రభుత్వం కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేశారు. అలాగే ఈ యంత్రాల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలను ఆన్‌లైన్‌లోనే ముందుగానే నమోదు చేసుకునేవారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, వ్యవసాయ పంటల యాజమాన్య పద్ధతులపై సమాచారం వీడియోల రూపంలో తెలుసుకునేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ సర్వర్లు పనిచేయకపోవడంతోపాటు సచివాలయ సేవలు ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

**నియోజకవర్గంలో ఆర్‌బీకేలు**

నియోజకవర్గంలోని మండలాల పరిధిలో గత ప్రభుత్వం 107 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది.ఈ ఆర్‌బీకేల్లో 107 కియోస్క్ యంత్ర పరికరాలను రైతులకు సేవలందించేలా ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆర్‌బీకేల్లో ఉన్న ఈ పరికరాలు కేవలం ఎరువుల అమ్మకాలకు మాత్రమే ఉపయోగిస్తూ మిగిలిన సేవలకు దూరంగా ఉంటున్నాయి. అయితే అధికారులు మాత్రం వాటిని వినియోగిస్తున్నామని చెబుతున్నారు.

**పీఎంఏఐడీ యాప్ ఏర్పాటు:**

రైతుభరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన కియోస్క్ పరికరాల స్థానంలో పీఎంఏఐడీ యాప్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనివల్ల అరకొర సేవలు మాత్రమే అందుతున్నాయని రైతులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలను నిరుపయోగంగా ఉంచడం సరికాదని, పూర్తిస్థాయిలో సేవలందించాలని రైతులు కోరుతున్నారు.

### కియోస్క్ సేవలు కొనసాగించాలి



రైతు సంక్షేమానికి గత ప్రభుత్వం ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్ర సేవలు కొనసాగించాలి. ఎరువులు, పురుగుమందులు నమోదుతోపాటు మార్కెటింగ్ సౌకర్యాలను తెలుసుకునేందుకు కియోస్క్ యంత్రాలు ఎంతగానో ఉపయోగపడేవి.

అళ్ల సతీష్ చౌదరి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

### రైతులకు తోడ్పాటు అందించండి



రైతులకు మానవతా దృక్పథంతో కూటమి ప్రభుత్వం సాయం అందించాలి. గత ప్రభుత్వం మాదిరిగానే సాంకేతిక పరిజ్ఞానాన్ని కొనసాగించాలి. కోట్ల రూపాయలతో ఉపయోగపడుతున్న రైతు భరోసా కేంద్రాలను మరింత ఆధునికరించాలి.

శనిపల్లి రామకృష్ణ (విష్ణు) సర్పంచ్ సానిగూడెం

### సేవలు కొనసాగుతున్నాయి:



ఆర్‌బీకేల్లో ఉన్న కియోస్క్ సేవలు వినియోగిస్తున్నాం. రైతులకు అన్ని రకాల సేవలు అందజేస్తున్నాం. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సేవలందించేలా కృషి చేస్తున్నాం.

సుబ్బారావు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వ్యవసాయ శాఖ

### పేద రైతులను ఆదుకోవాలి



చదువు లేని రైతులను కూటమి ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలి. రైతులకు రైతు సేవ కేంద్రాలు ఐదు సంవత్సరాలుగా ఉపయోగపడుతున్నాయి ఇప్పుడు ఎందుకు వాటిని ప్రభుత్వం అశ్రద్ధ చేస్తుందో అర్థం కావట్లేదు. సేవ కేంద్రాలను మరింత ఆధునికరించి వినియోగంలో తీసుకొచ్చి రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

మాగంటి రాజు, రైతు

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


భీమడోలులో తడి, పొడి చెత్త అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమడోలు: పారిశుద్ధ్యంపై పంచాయతీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద పెదవేగి మండలాల క్లాప్ మిత్రలు, హరిత రాయబారులకు రెండో రోజైన గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈవోఆర్‌డీ ఏ.సుందరి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధులుగా ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, పెదవేగి ఈవోఆర్‌డీ షరీఫ్‌లు హాజరయ్యారు. డంపింగ్ యాడ్‌లో తడి, పొడి చెత్తలను వేర్వేరు చేసే విధానాన్ని వారు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని సేకరించిన తడి, పొడి చెత్తలను డంపింగ్ యాడ్‌లకు తరలించి వాటి నుంచి వర్మి కంపోస్ట్‌ను తయారీ చేయాలన్నారు. తద్వారా వచ్చే ఆదాయంతో పంచాయతీలు ఆర్థిక పరిపుష్టిని సాధిస్తాయన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండడంలో క్లాప్ మిత్రలు, హరిత రాయబారుల సేవలను అభినందించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎం.వెంకట్రావు, టి. ముత్తయ్య, కేవీఎల్ తనూజ, భూషణంలు తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతో ఆరోగ్యం


సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ కవిత


అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాల్లో పాల్గొన్న సూపర్‌వైజర్లు

భీమడోలు: ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామని గుండుగొలను సెక్టార్ సూపర్‌వైజర్ ఎం. కవిత తెలిపారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా పూళ్ల సెక్టార్ పరిధిలోని చెట్టున్నపాడు గ్రామంలో అంగన్‌వాడీ సిబ్బంది, లబ్ధిదారులతో కలిసి గురువారం అవగాహన ర్యాలీలను నిర్వహించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలను మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కవిత మాట్లాడుతూ చిన్నారుల్లోని పౌష్టికాహార లోపాలను గుర్తించి వాటిని నివారించడం జరుగుతుందన్నారు, చిరుధాన్యాల వినియోగం వల్ల ఆరోగ్య సంరక్షణ సాధ్యమన్నారు. అంగన్‌వాడీల్లోని పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టిని చూపాలన్నారు. బడి ఈడు పిల్లలంతా విధిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎఎన్ఎం పేరంటాలు, కార్యకర్తలు బి.నాగదుర్గ, డి.సౌమ్య సుధ, సీహెచ్ మహాలక్ష్మీ, ఆశావర్కర్ డి.పాప తదితరులు పాల్గొన్నారు.

**పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం**

దెందులూరు: మండలంలోని కొత్తపల్లి, చల్లచింతలపూడి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం దెందులూరు పోతునూరు, సోమవరప్పాడు సెక్టార్ల సూపర్‌వైజర్ చిట్టెమ్మ, కుమారిల ఆధ్వర్యంలో పౌష్టికాహారం పట్ల అవగాహన సమావేశం జరిగింది. స్త్రీ శిశు సంక్షేమ శాఖ అమలు చేస్తున్న పథకాలు లబ్ది సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాల్లో వివరించారు. క్రమం తప్పకుండా చిన్నారులు గర్భిణీలు బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ లబ్దిని పొందాలన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల ఆధ్వర్యంలో మందులు వాడాలన్నారు.



# రైతులకు సత్వర సేవలు అందించాలి


అంబర్‌పేట రైస్ మిల్లు వద్ద రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ రమాదేవి

భీమడోలు: రైతులకు సత్వర సేవలు అందించి అండగా నిలవాలని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. జేసీ ధాత్రిరెడ్డి ఆదేశాల మేరకు గురువారం పోలసానిపల్లి, భీమడోలు 1, 2,3 రైతు సేవా కేంద్రాలు, రైస్ మిల్లులను భీమడోలు తహసీల్దార్ రమాదేవి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తేమ శాతం గుర్తించే విధానాన్ని పరిశీలించారు. అంబర్‌పేటలోని శ్రీదుర్గ ఆగ్రో ఇండస్ట్రియల్, విజయదుర్గా రైస్ మిల్లులను సందర్శించారు. రికార్డులను ఆమె పరిశీలించి పలు సూచనలు అందించారు. రైతుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు నాణ్యమైన గోనె సంచులు పంపిణీ చేయాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వారికి హెచ్చరించారు. తొలుత రైతు సేవా కేంద్రాలను ఆమె పరిశీలించారు. 17 తేమ శాతం కన్నా తక్కువ ఉండేలా చూసుకోవాలని, అదే విధంగా అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద తేమ కొలుచే యంత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతులకు ఎటువంటి చిరుగులు లేని సంచులను ఇవ్వాలన్నారు. రైతుల అనుమానాలను నివృత్తి చేయాలని, రైతులను ఇబ్బందులకు గురి చేస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భరత్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

### ఫత్తేపురం పంట కాలువ పరిశీలన

ఉంగుటూరు: మండలంలోని రావులపర్రు వద్ద ఫత్తేపురం పంటకాలవకు రెగ్యులేటర్ నిర్మించి తోకలపల్లి, బైనేపల్లి, ఆముదాలపల్లి గ్రామాలకు మంచినీరు అందించాలనే యోచనలో భాగంగా ఎమ్మెల్యే ధర్మరాజు గురువారం రాత్రి పరిశీలించారు. ఇరిగేషన్ అధికార్లు ఇరిగేషన్ ఎ ఇ సుధారాణి, డిస్ట్రిబ్యూటరీ చైర్మెన్ రెడ్డి శివప్రసాద్, ప్రాజక్టు చర్మెన్ మురళీ,కూటమి నాయకులుపాల్గొన్నారు.

# గర్భిణులు ఉచిత వైద్య పరీక్షలు వినియోగించుకోవాలి


గణపవరం పీహెచ్‌సీలో గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి కిరణ్మయి

గణపవరం: గర్భిణులు తప్పనిసరిగా పీహెచ్‌సీలో ప్రతీ నెలా నిర్వహించే ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఆస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి అన్నారు. గురువారం పీహెచ్‌సీలో గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలకు నాలుగు పర్యాయాలు పీహెచ్‌సీలో ఉచిత వైద్య పరీక్షలు చేస్తామని, ఐరన్, కాల్షియం మాత్రలు అందజేస్తామన్నారు. గర్భిణుల్లో హైరిస్క్ ఉన్న వారిని గుర్తించి వెంటనే వారికి తగిన వైద్యసేవలు అందజేయడం జరుగుతుందన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈసందర్భంగా 73 మంది గర్భిణులకు పరీక్షించి వారికి మందులు అందజేశారు. ఈకార్యక్రమంలో సిహెచ్‌వో జాలాది విల్సన్, హెచ్‌వి సీహెచ్ పద్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### ఇంట్రా మ్యూరల్ పోటీల్లో నీరజ్ చోప్రా


విజేతలకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: పోటీతత్వం నిరంతర సాధన ప్రతి మనిషి విజయానికి బాటలు వేస్తాయని దెందులూరు తహసీల్దార్ బీ. సుమతి అన్నారు. గురువారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నతానియేల్ అధ్యక్షతన ఇంట్రా మ్యూరల్ పోటీలు ముగింపు సభ జరిగింది. అతిథులుగా విచ్చేసిన తహసీల్దార్ బీ. సుమతి, మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు) మాట్లాడుతూ గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో విద్యాభ్యాసం ప్రతి ఒక్కరికి వరమని తెలిపారు. దేశంలోనే పేరు ప్రఖ్యాతలు గాంచిన ఏకైక ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల అన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు కలలుగన్న లక్ష్యాలను అధిగమించేందుకు ప్రణాళిక చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నతానియల్ మాట్లాడుతూ పోటీల్లో బాలురవిభాగంలో నీరజ్ చోప్రా హౌస్ విన్నర్స్ కాగా రవికుమార్ తహియా హౌస్ రన్నర్స్‌గా నిలిచారు. బాలికల విభాగంలో సైనా నెహ్వాల్ హౌస్ విన్నర్స్ కాగా పీవీ సింధు హౌస్ రన్నర్స్ గా నిలిచారు. విజేతలు జట్లుకు తహసీల్దార్ సుమతి, మండల అధ్యక్షులు మాగంటి నారాయణప్రసాద్ (మిల్లు బాబు షీల్డ్, ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో డాక్టర్ సంగా దిలీప్ కుమార్, డాక్టర్ రత్నబాబు, పతాంజలి, కళాశాల సిబ్బంది ఉన్నారు.